దసరా సంబురం

• ఘనంగా విజయదశమి వేడుకలు • అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
• రావణ దహనంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు


రావణదహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

మల్కాజిగిరి: దసరా పర్వదిన సంబరాలు ఘనంగా ముగిశాయి. పలు దేవాలయాల్లో శమీపూజ నిర్వహించారు. ఓల్డ్ నేరెడ్‌మెట్‌లో కళాభారతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రవణ్, రాజ్యలక్ష్మి, మురుగేష్ హాజరయ్యారు. నిర్వాహకులు కటికెల నరేష్, గంగాధర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శత్రు నాశనం, విజయప్రాప్తికి శమీపూజ..

బోడుప్పల్: శత్రు నాశనం, విజయ ప్రాప్తిని కలిగించేంది శమీ వృక్షమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్ అన్నారు. విజయదశమిని పురస్కరించుకుని బోడుప్పల్‌లో నిర్వహించిన శమీపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వేడుకగా రావణ దహనం..

ఉప్పల్: ఉప్పల్ దసర ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందుముల పరమేశ్వరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన దసర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శనివారం ఆయన మాట్లాడుతూ.. చెడుపై మంచి ఎప్పుడూ విజయం సాధిస్తుందని అందుకు నిదర్శనం దసర పండుగనే అన్నారు. అనంతరం వేద పండితులతో శమీపూజ, పాలపిట్ట దర్శనంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. విశిష్ట అతిథులుగా కార్పొరేటర్ మందుముల రజిత, దుబ్బ నర్సింహారెడ్డి, అశోక్‌కుమార్‌గౌడ్, రాజిరెడ్డి, బజారు జగన్నాథ్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ నేతలు తౌఫిక్, అంజయ్య గుప్తా, లుకాస్, రామకృష్ణ, రఫిక్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

చెడుపై మంచి గెలుపే విజయ దశమి..

మల్లాపూర్: చెడుపై మంచి గెలిచిన రోజే విజయదశమి అని ఉప్పల్ నియోజకవర్గం బీజేపీ ఎంబీసీ చైర్మన్ సంగిశెట్టి రవీందర్‌సాగర్ అన్నారు. మల్లాపూర్ బ్రహ్మపురి కాలనీలోని దుర్గామాతాకు రవీందర్‌సాగర్ ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాదేవీ విగ్రహాలను శోభాయాత్ర నిర్వహించిచ నిమజ్జనం చేశారు.

నాచారం మహంకాళి దేవాలయంలో..

విజయ దశమిని పురస్కరించుకుని నాచారం మహంకాళి సహిత మహాకాళేశ్వరస్వామి దేవాలయంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్ ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. నాచారం మహంకాళి దేవాలయ చైర్మన్ కృష్ణారెడ్డి, ట్రస్ట్ బోర్డు పాలక వర్గం తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మల్లాపూర్ నాచారంలో శనివారం రాత్రి విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రావణాసుర దహనం చేసి పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. మల్లాపూర్ దసరాను పురస్కరించుకుని శమీపూజ చేశారు. నాగలక్ష్మినగర్ కాలనీలోని నందీశ్వరాలయం, ఓల్డ్ మల్లాపూర్‌లోని సీతారామాంజనేయస్వామి దేవాలయంలో శమీపూజలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో రాజరాజేశ్వరిగా అమ్మవారు



రామంతాపూర్ సత్యదేవుని ఆలయంలో..

ఘనంగా రావణ సంహార మేళా..

రామంతాపూర్ : ప్రధాన రహదారిలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద దసరా పర్వదినం సందర్భంగా ఆదివారం ఘనంగా రావణ సంహారమేళాను శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హిందూ సమాజం ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్న చెక్కు చెదరకుండా తన ప్రాబల్యాన్ని పెంచుకుంటూ పోతోందన్నారు. హిందూ ధర్మం గంగానది లాంటి పవిత్రమైందని వివరించారు.


ప్రత్యేక పూజల్లో బీజేపీ ఎంబీసీ చైర్మన్ రవీందర్‌సాగర్


ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో విల్లు ఎక్కు పెట్టిన పరమేశ్వర్‌రెడ్డి


రావణ దహనంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి


శమీపూజలో పాల్గొన్న మేయర్ అజయ్‌యాదవ్


మహంకాళి ఆలయంలో మందముల పరమేశ్వర్‌రెడ్డి


మల్లాపూర్‌లో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

పండగ శుభాకాంక్షలు


హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

ఉప్పల్: విజయ దశమిని పురస్కరించుకుని ఉప్పల్ బీఆర్ఎస్ నేతలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. గుడి మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, జెల్లి మోహన్, ఆకిటి బాల్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణమహోత్సవం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి కల్యాణం ఘనంగా జరిగింది. కల్యాణమహోత్సవాన్ని ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసీ రమణాచార్యులు, వేణుగోపాలాచార్యులు నిర్వహించారు. ప్రతి నెలా రెండో ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నామని ఈవో రవీందర్‌రెడ్డి వివరించారు.

త్రోబాల్ టీమ్‌లో సత్తా చాటిన మేడ్చల్ యువతి



మేడ్చల్: జాతీయ త్రోబాల్ మహిళల జట్టు విజయంలో మేడ్చల్‌కు చెందిన యువతి ప్రసన్న కుమారి కీలక పాత్ర పోషించింది. కండ్లకోయ సీఎంఆర్ కళాశాలలో ప్రసన్నకుమారి బీటెక్ 4వ సంవత్సరం చదవుతోంది. తల్లి అంగన్‌వాడీ టీచర్, తండ్రి వెల్డర్‌గా పని చేస్తున్నారు. ఆటలపై ఉన్న ఆసక్తితో ప్రసన్న కుమారి జాతీయ త్రోబాల్ జట్టుకు ఎంపికైంది. ఇటీవల బ్యాంకాక్, థాయిలాండ్‌లలో జరిగిన మ్యాచ్‌లలో ఆమె పాల్గొని విజయాలు సాధించింది. దీంతో ఆదివారం స్వస్థలంకు చేరుకున్న ఆమెను స్థానికులు, బంధువులు అభినందించి సన్మానాలు నిర్వహించారు.

మున్సిపల్ సిబ్బందికి దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్ తన సొంత ఖర్చులతో దసరా పండుగ సందర్భంగా ఘనాపూర్‌లో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విలీన గ్రామాలైన ఎదులాబాద్, ఘనాపూర్, అవుషాపూర్, అంకుషాపూర్, మాదారం, మర్పల్లిగూడలో పనిచేస్తున్న 110 మంది సిబ్బందికి దుస్తులు అందజేశామన్నారు. సిబ్బంది బాగుంటేనే అందరం బాగుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు బద్దం గోపాల్‌రెడ్డి, వేముల మమత గౌడ్, మాజీ ఉపసర్పంచ్ వేముల పరమేష్ గౌడ్, యూత్ అధ్యక్షుడు అమర్, మాజీ ఎంపీటీసీ కందుల కుమార్, సీనియర్ నాయకులు మాధవరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి


హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవంలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 24వ డివిజన్‌లో హెమాస్ట్ లైట్ల ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ.. దశలవారీగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో లారీ క్లీనర్ మృతి

శామీర్‌పేట్: విద్యుత్ షాక్‌తో లారీ క్లీనర్ మృతి చెందిన ఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్‌కు చెందిన అబ్దుల్ అదిల్‌ఖాన్ (28), లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. మజీద్‌పూర్‌లోని ఓ పెట్రోల్‌బంకు సమీపంలోకి రాగానే తను పనిచేస్తున్న లారీ టైర్ పంచర్ అయ్యింది. దీంతో టైరు మార్చేందుకు సామగ్రి తీసుకునేందుకు లారీ పైకి వెళ్లగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ


శంకుస్థాపనలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

మేడిపల్లి: పీర్జాదిగూడలోని 3వ డివిజన్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాయకులు ననబోలు రాజశేఖర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, రాముయాదవ్ పాల్గొన్నారు.

విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన..

ఉప్పల్: చిలుకేశ్వర ఆంజనేయస్వామి దేవస్థానం హరిహర క్షేత్రం చిలుకానగర్‌లో విజయదశమి పండుగ సందర్భంగా మూలవిరాట్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుబాష్‌రెడ్డి, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజలో పాల్గొన్న ఎంపీ ఈటల

చెరువుల్లోకి పారిశ్రామిక వ్యర్థాలు !

ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ వేత్తలు, జీహెచ్ఎంసీ అధికారులు

ఉప్పల్: నియోజకవర్గ పరిధిలో నాలాల్లో పారేవి మురుగు జలాలు కావు. అవి గరళంతో నిండిన పారిశ్రామిక వ్యర్థాలు. వాటిని తాకితే ఇక అంతే సంగతులు. ఎలాంటి జలచరాలు నివసించడానికి వీలులేకుండా ఉన్నట్లు అధికారులు ఇటీవలే కనుగొని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రీట్‌మెంట్ ప్లాంట్ పరిశీలన..

అప్రమత్తమైన ఉప్పల్, కాప్రా సర్కిళ్ల వివిధ విభాగాల అధికారులు నాలాలు , చెరువులు, పారిశ్రామిక వ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంటును పరిశీలించారు. పరిశ్రమల నుంచే నేరుగా నాలాల్లోకి పైపులైన్లు వేసి వ్యర్థాలను వదలడాన్ని చూసి విస్తుపోయారు.

పీసీబీ అధికారుల కంట్రోల్ తప్పింది...

కాలుష్యాన్ని అరికట్టాల్సిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కాలుష్య కారకులతో అంటకాగుతున్నారనే విమర్శలున్నాయి. పారిశ్రామిక వాడ (ఐలా)అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిశ్రమను బట్టి వ్యర్థాలు..

ప్రతి కెమికల్ పరిశ్రమ నుంచి కంపెనీ స్థాయిని బట్టి వ్యర్థాలు ఉత్పత్తి అవుతాయి. వీటిని సరైన పద్ధతిలో సేకరించి మల్లాపూర్ పారిశ్రామక వాడల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాలి. అక్కడ ట్రీట్ అయిన శుద్ధి నీటిని మాత్రమే నాలాల్లోకి వదలాలి. అలా కాకుండా ఒక్క ట్యాంక్ నీటిని శుద్ధి కేంద్రానికి తరలించాలంటే డీడీ రూపంలో ఐలా కమిషనర్ పేరిట జమ చేయాల్సి ఉంటుంది.

డీడీ కట్టినా క్యూలోనే..

డీడీ తదితర నిబంధనలు పట్టించుకోని కొందరు బడా బాబులు నేరుగా వ్యర్థాలను నాలాల్లోకి సులభంగా వదిలించుకోవచ్చన్న భావనతో కాలుష్యానికి కారుకులవుతున్నారనే ఆరోపణలున్నాయి.


నాలాల్లోకి పారిశ్రామిక వ్యర్థాలు ఇలా..

ఆందోళనలో స్థానికులు..

నాలా పరివాహక ప్రాంతాల ప్రజలకు శరీరం మండటం, కడుపులో తిప్పినట్లు అనిపించడం, చర్మం దురద పెట్టడం లాంటి అనేక వ్యాధులు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు.

◆ ఉప్పల్, నాచారం, మల్లాపూర్, కుషాయిగూడ, చర్లపల్లి పారిశ్రామికవాడల్లో దాదాపుగా 5000 వరకు చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు ఉన్నాయి. వాటిల్లో దాదాపుగా 200 వరకు కెమికల్ పరిశ్రమలు ఉన్నాయి. దీనిలో 80కి పైగానే కెమికల్ పరిశ్రమలు అక్రమంగా నడుస్తున్నట్లు సమాచారం. వీటన్నింటికి ఒకేచోట ట్రీట్‌మెంట్ ప్లాంట్లు మల్లాపూర్‌లో మాత్రమే ఉంది. దీని కెపాసిటీ రెండు ఎంఎల్‌డీ సామర్థ్యం ఉంది. రోజూ కేవలం 500 కేఎల్ కన్నా తక్కువే ట్రీట్‌మెంట్‌కు వస్తున్నట్లు అక్కడి సిబ్బంది తెలిపారు.

◆ నాచారం పెద్ద చెరువు, హెచ్ఎంటీ చెరువు, ఉప్పల్ నల్ల చెరువుల్లోకి చేరుతున్నాయి. వీటితో పాటు బోడుప్పల్ సుద్దకుంట చెరువు ద్వారా కూడా పెద్దఎత్తున పారిశ్రామిక వ్యర్థాలు ఉప్పల్ నల్ల చెరువుకు చేరుతున్నట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.



చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..



చెరువులు పారిశ్రామిక వ్యర్థాలతో నిండిపోతున్నట్లు సమాచారం అందింది. దీంతో వివిధ శాఖల అధికారులతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేశాం. అనేక అంశాలు బయటపడ్డాయి. వీటిని నియంత్రించడానికి పోలీసులను అప్రమత్తం చేసి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. మ్యాన్‌హోల్స్ ద్వారా పారిశ్రామిక వ్యర్థాలను పారబోస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– అంజనేయులు, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్

రైలు ఢీకొని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని మహిళ (55) జామై ఉస్మానియా – ఆర్ట్స్ కాలేజీ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో వ్యక్తి మృతి


మృతుడు మస్యం సైదులు

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... చార్మినార్, ఫరూఖ్‌నగర్ ప్రాంతానికి చెందిన మస్యం సైదులు (33) ఫలక్‌నుమా - శివరాంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులగణన జీఓపై హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో కుల గణన కోసం ప్రభుత్వం జీవో నంబర్ 18 జారీ చేయడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆదివారం పేర్కొన్నారు. ఇచ్చిన మాటలకు కట్టుబడి కులగణను శ్రీకారం చుట్టడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీల పోరాటం వలనే ప్రభుత్వం కులగణను జీవో జారీ చేసిందన్నారు.

ఓయూ కాలేజీల్లో నిధుల కొరత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని 10 కాలేజీలతో పాటు అనుబంధ నిజాం, సికింద్రాబాద్, సైఫాబాద్ పీజీ కాలేజీలు, జిల్లా పీజీ సెంటర్లలో తీవ్రమైన నిధుల కొరత ఏర్పడింది. గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీ యింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కాలేజీలు జీరో బడ్జెట్‌తో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఓయూలో వివిధ కోర్సులు చదివే విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ అయినందున ఫీజులు ఎవరూ చెల్లించడం లేదు. విద్యార్థులు ఫీజులు చెల్లించక, ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయక ఓయూ కాలేజీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు నెల్లి సత్య ప్రభుత్వాన్ని కోరారు. రీయింబర్స్ నిధులు విడుదల చేయకపోవడంతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రవేటు కాలేజీల యజమానులు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అతిథి అధ్యాపకుల వేతనాలు చెల్లించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా 135 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పని చేస్తున్న అతిథి అధ్యాపకుల వేతనాలు చెల్లించాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డా. చింతల కిశోర్‌కుమార్ కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంత వరకు వేతనాలు చెల్లించక పోవడంతో అధ్యాపకుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ముఖ్యమైన పండుగ దసరాను అరకొరగా చేసుకున్నారని కనీసం దీపావళి వరకైనా వేతనాలు చెల్లించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి

లాలాపేట: ఉన్నత విద్యాభ్యాసంతో ప్రపంచస్థాయి మేధావిగా గుర్తింపు పొందిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తార్నాక చింతల్ బస్తీ నాయకులు తుంగ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం చింతల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని నిత్యం మన జీవితాల్లో అనుసరించేలా దళిత బహుజనులందరిని జాగృతం చేసేలా గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రతి ఆదివారం ఈ జ్ఞానమాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, చింతల్ నాయకులు పాల్గొన్నారు.